క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న ధర్మకర్త కృష్ణమాచార్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ మండపంలోని కళ్యాణవేదికను పూలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కళ్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పూజారుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణానికి చెందిన కండె లింగయ్య, పాపిశెట్టి రాము, బికుమాండ్ల నర్సింహ, డా.శ్రీనివాస్, వీరబొమ్మ రామ్మోహన్, చంద్రశేఖర్, నీలయాదయ్య, కండె భాస్కర్, సుమన్, అప్పి తదితరులు పాల్గొన్నారు.

11న భూ బాధితులతో సమావేశం

- కుర్మిద్దకు రానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- సభ విజయవంతానికి నేతల పర్యటన


సభకు తరలిరావాలని ప్రజలను కోరుతున్న సీపీఎం నాయకులు రాంచందర్, అంజయ్య

యాచారం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఈనెల 11న కుర్మిద్దకు రానున్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడనున్నారు. గ్రామంలో పాదయాత్ర నిర్వహించిన అనంతరం ఫార్మా భూ బాధితుల సభలో మాట్లాడుతారు. జాన్‌వెస్లీ రాక నేపథ్యంలో సీపీఎం జిల్లా నాయకులు రాంచందర్, అంజయ్య శనివారం కుర్మిద్ద, మీరాఖాన్‌పేట, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, ఆకులామైలారం, ఉట్లపల్లిలో పర్యటించారు. కుర్మిద్దలో జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని ప్రజలను కోరారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎంపీలు మల్లురవి, కిరణ్‌కుమార్‌రెడ్డిలకు ఆహ్వానపత్రిక అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌లో ఈనెల 13న ప్రారంభమయ్యే వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శనివారం ప్రజాభవన్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి తదితరులకు ఇన్విటేషన్లు అందించారు. వీరిలో మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, నిర్వాహకులు మధు, భిక్షపతి, కుమార్, రాజు ఉన్నారు.

'ఇందిరా మహిళా శక్తి'కి తరలిన మహిళలు

తుక్కుగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలు శనివారం తరలివెళ్లారు. మహిళలకు అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

పహాడీషరీఫ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు గనాతే రాజు ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలనీలోని భారతమాత విగ్రహం వద్ద పూజలు నిర్వహించి మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడుతారో అక్కడే దేవతలు పూజింపబడుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు సత్యదేవి, లక్ష్మి, వసంత, పద్మ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో మార్కెట్ చైర్‌పర్సన్ గీతను సత్కరిస్తున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇంద్ర


ఇబ్రహీంపట్నం రూరల్: పాషానరహరి స్మారక కేంద్రంలో సన్మానిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సామేలు తదితరులు


యాచారం: గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణంరాజు తదితరులు


ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న సీఐ జగదీశ్వర్

మహిళలకు ఘన సన్మానం

ఆమనగల్లు, ఇబ్రహీంపట్నంలోని ఆయా మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం వారి బాధ్యత వంటింటికే పరిమితం కాకుండా సామాజికంగా, ఆర్థికంగా చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ఆయా రంగాల్లో గుర్తింపు తెచ్చుకున్న మహిళలకు శాలువా కప్పి సన్మానించారు.


ఆమనగల్లు: జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధతో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


తుర్కయంజాల్: మహిళలకు బ్యాగులు పంపిణీ చేస్తున్న పర్యావరణవేత్త యాదయ్య


మాడ్గుల: ఇర్విన్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు


మంచాల: గ్రామ పంచాయతీ మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కడ్తాల్: మొక్కనాటి నీరుపోస్తున్న నాయకులు, మహిళలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంఈఓ మనోహర్ ఆకాంక్షించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ఏదైనా సాధించాలనే కృషి పట్టుదల ఉంటే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి, భయాందోళనకు గురికాకుండా సంసిద్ధులు కావాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పండుగ బాల్‌రాజ్, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం


కడ్తాల్‌లో ప్రయాణికులకు అంబలి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా సహకారంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ వేసవిలో 120 రోజుల పాటు అంబలి పంపిణీ చేయడం గొప్పవిషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, లయన్స్ క్లబ్ కార్యదర్శి మహేశ్, నాయకులు గంప శ్రీనివాస్, వ్యా, సురేశ్, శ్రీకాంత్, రాజేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుశీల, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, ప్రియాంక, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బెస్ట్ క్లబ్‌గా 'ఆమనగల్లు లయన్స్'


బెస్ట్‌క్లబ్‌గా నిలిచిన ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదు మెగా హెల్త్ శిబిరాలు, నాలుగు గుండె సంబంధిత హెల్త్ క్యాంపులు, 21 సార్లు అన్నదానం, 120 రోజుల పాటు అంబలి వితరణ కేంద్రం, ఉచిత రక్త పరీక్షలు, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్లు చెన్న కిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జిల్లా చైర్మన్లు రామచంద్రారెడ్డి, కండె ఓంకారం, రాంరెడ్డి, జూలూరి రమేశ్, లింగయ్య, అంజయ్య, నర్సింహ, బిక్షపతి, రమేశ్‌బాబు, పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


అన్మాస్‌పల్లి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కలికిదోన గుట్ట గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ, కృష్ణమూర్తిశర్మ, శ్రీనివాసమూర్తి, శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బికుమాండ్ల శ్యాంసుందర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కడ్తాల్: సమాజంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాల మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రముఖ పారిశ్రామికవేత్త విజయభాస్కర్‌రెడ్డి, నీరజ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

- దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలి
- సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్


ఆమనగల్లులో సింగిల్‌విండో కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్

ఆమనగల్లు: స్థానిక పీఏసీఎస్ ద్వారా రైతులకు ఏటా రూ.3 కోట్ల దీర్ఘకాలిక పంట రుణాలు అందజేస్తున్నామని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తమ పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. పీఏసీఎస్ నుంచి రుణాలు తీసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని కోరారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, వెంకటయ్య, చేగురి వెంకటేశ్, దోల్యానాయక్, దావ శ్రీపాల్, జంగమ్మ, చెన్నమ్మ, అరుణ, సేవ్య నాయక్, సీఈఓ దేవేందర్, సిబ్బంది అల్లాజీ, పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా డైరెక్టర్లను సన్మానించారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

బడంగ్‌పేట్: పల్లవి మోడల్ స్కూల్ తిరుమలగిరిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా యూకేజీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా సీఎస్ రాధా, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో సమస్యల తిష్ట

ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేక జనం అవస్థలు పడుతున్నారు. పంచాయతీల్లో నిధులు నిండుకుపోవడంతో ప్రత్యేక అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పర్యవేక్షణ గాడి తప్పింది. కనీసం రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తీయలేని దుస్థితి దాపురించింది. – మంచాల


ఆరుట్లలో రామాలయం వీధిలో..



ఆరుట్లలోని వివేకానంద చౌరస్తాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటినుంచి శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రం వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రం

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో ప్రకృతి రమణీయ కొండపై వెలసిన శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రం ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులకు వసతులు కల్పిస్తున్నారు.

ఇదీ చరిత్ర..

అన్మాస్‌పల్లిలో వేంకటేశ్వరాలయం, శివాలయం, రామాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలు ఉండేవి. గ్రామ సమీపంలో మహావృక్షం కింద శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం ఉండేదని, భక్తులచేత పూజలందుకునేదని, గతంలో అన్మాస్‌పల్లి గ్రామం నుంచి ఆలయం వరకు రథయాత్ర సాగేదని ఇక్కడి ఆనవాళ్లు చెబుతున్నాయి. కాలక్రమేణా ఈ ఆలయాలు శిథిలమై పూజలకు దూరమయ్యాయి. ఇదిలా ఉండగా గ్రామస్తుల అభీష్టం మేరకు వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఎనిమిదేళ్ల క్రితం పునర్ నిర్మించారు. శివాలయం, రామాలయాల పునర్‌నిర్మాణానికి దేవాదాయ శాఖ సహకారంతో, ఆలయ ధర్మకర్తలు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి దంపతులు ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి వేడుకలు చేశారు. తొలి వార్షికోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాల వివరాలు..

- తొలిరోజైన ఆదివారం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, ప్రతిష్ఠ విగ్రహాల స్నపనం.
- 9న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, ఉపనిషత్తు పారాయణములు, శ్రీరామచంద్రమూర్తికి మహార్చాన, లలితా పారాయణం, కుంకుమార్చన, త్రిశక్తి పూజలు, అమ్మవారి అర్చన, శివాలయంలో బిల్వార్చన మన్య సూక్త పారాయణం, రామాలయంలో పుష్పార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, సరస్వతి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, శ్రీలలిత పారాయణం, శ్రీచక్ర పూజలు, హనుమాన్ ఆలయంలో చాలీసా పారాయణం, వేదపండితులు మేళ్లూరి వెంకటేశ్వరశర్మ, ఆధ్యాత్మికవేత్త, కవయిత్రి ఎల్లికంటి జ్ఞానప్రసూనాశర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు.